# మానవత

## మేరువ చంద్రశేఖర్

"అయ్యా! ఆడు సచ్చిపోతున్నాడయ్యా. రకతం సానా పోయింది. ఎంటనే పెద్దాసుపత్రికి తోలుకెళ్లాలయ్యా."

"అవునయ్యా మాయదారి యెద్దు కుమ్మేసి కూడా సానా సేపయింది. ఆడు గిలగిలా కొట్టుకుంటున్నాడు... తమరే సాయం చెయాలి"

"బాబయ్యా! పెద్దోరు తమరు ఈ పేదోళ్ల మీద దయచూపండయ్యా"

కారులో కూర్చుని విలాసంగా విల్స్ సిగరెట్ తాగుతూ, గ్రామస్తులు హఠాత్తుగా తన కారుకి అడ్డంగా వచ్చి ఆపినందుకు విసుక్కుంటూ రిస్ట్‌వాచ్ చూసుకున్నాడు ధన్‌వంత్.



టైం ఆరున్నర కావస్తోంది. అప్పుడే చీకట్లు ముసురుకుంటున్నాయి. పార్టీ ఆరు గంటలకే. అప్పటికే అరగంట ఆలస్యమైంది, మధ్యలో వీళ్ళదో గోల. రమ ఎదురుచూస్తూ వుంటుంది. త్వరగా వెళ్ళాలి.

అంతే మరుక్షణం నిర్లక్ష్యంగా వారివైపు చూస్తూ హారన్ గట్టిగా మోగించి ఆక్సిలేటర్ బలంగా నొక్కాడు గేర్ మారుస్తూ.

రివాల్వర్లో నుంచి వెలువడ్డ బుల్లెట్‌లా కారు ఒక్క జెర్క్ ఇచ్చి ముందుకు దూసుకుపోయింది. అంతవరకు కారుకడ్డంగా నిలబడ్డ వారంతా భయంతో పక్కకి తప్పుకున్నారు.

"ఈడు మడిసేనా?" కడుపు మండిన పల్లెటూరి యువకుడొకడు కామెంట్ చేశాడు.

"విలేజ్ బ్రూట్స్" కసిగా ఆంగ్లంలో తిట్టుకున్నాడు ధన్‌వంత్ కారు వేగం పెంచుతూ.

కారు సన్నటి తారురోడ్డు మీద మెత్తగా జారిపోతూ వుంది.

ఎంతలేదన్నా సిటీ చేరడానికి ఇంకొక అరగంటైనా పడుతుంది.

ఆలోచిస్తూ పరధ్యానంగా వున్నాడేమో, ఎదురుగా రోడ్డుకడ్డంగా తాపీగా వెళుతున్న గేదెని చూసుకోలేదు ధన్‌వంత్.

హఠాత్తుగా రోడ్డుకడ్డంగా అంత దగ్గరలో గేదెని చూసేటప్పటికి ధన్‌వంత్‌కేంచేయాలో పాలుపోలేదు. అంత స్పీడులో సడన్ బ్రేక్ వెయ్యలేడు. దాన్ని తప్పిద్దామని పూర్తిగా ఎడమవైపు తీసుకుని సర్రున అదే వేగంతో కుడివైపుకు తిప్పబోయాడు కాని అప్పటికే ఆలస్యమైపోయింది. మసక చీకట్లో ధన్‌వంత్ ఎడమవైపు రోడ్డుకు ఆనుకుని వున్న మైలురాయిని గమనించలేదు.

మరుక్షణం పెద్ద శబ్దంతో కారు రెండు పల్టీలు కొట్టింది. ఏం జరిగిందో తెలిసేలోగానే ధన్‌వంత్‌కి స్పృహ తప్పింది.

***

మళ్లీ స్పృహ వచ్చేటప్పటికి ధన్‌వంత్ హాస్పిటల్‌లో బెడ్ మీదున్నాడు. తలకి, చేతులకి, కాళ్ళకి తెల్లని బ్యాండేజిలు వున్నాయి.

తనకి స్పృహ వచ్చిందని బహుశా నర్సు చెప్పినట్లుంది. డాక్టర్‌తోపాటు అమ్మ, నాన్న, రమ, ఇంకా ఇద్దరు ముగ్గురు క్లోజ్ ఫ్రెండ్స్ లోపలికి వచ్చారు.

"హౌ ఆర్ యు ఫీలింగ్ మిస్టర్ ధన్‌వంత్" నవ్వుతూ ప్రశ్నించాడు డాక్టర్.

షాక్‌తో అందరివంకా బిత్తరపోతూ చూశాడు తప్ప సమాధానమివ్వలేదు ధన్‌వంత్.

"డోంట్ వర్రీ, యు విల్ బి ఆల్ రైట్ ఇన్ ఫ్యూ డేస్" మళ్ళీ డాక్టర్ అన్నాడు. అప్పటికి కొంచెం




కోలుకున్నాడు. లీలగా జరిగిన సంఘటన గుర్తొచ్చింది, రమ పుట్టినరోజు పార్టీకి తాను బయలుదేరాడని?

"మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే" చిరునవ్వుతో నీరసంగా రమవైపు తిరిగి అన్నాడు.

ఒక్కక్షణం అతనేమంటున్నాడో అర్థంకాక అందరు ధన్‌వంత్ వైపు చూశారు

"థాంక్యూ" కోలుకుంటూ రమ తిరిగి అంది. నా బర్త్‌డే జరిగి నాలుగు రోజులు అయింది.

ఈసారి ఆశ్చర్యపోవడం ధన్‌వంత్ వంతయింది. "ఏంటి నాలుగు రోజులు నేను స్పృహలో లేనా..?"

"అవును ధన్‌వంత్, యాక్సిడెంట్లో తలకి బలమైన దెబ్బ తగిలి రక్తం చాలా పోయింది. అసలు నీవు కోమాలోకి వెళ్ళిపోతావేమోనని డాక్టర్లు భయపడ్డారు. ఇప్పుడు స్పృహ వచ్చింది కదా భయంలేదు" తండ్రి చెప్పాడు.

"ఓమైగాడ్ అంత బలమైన దెబ్బ తగిలిందా..?" నమ్మలేనట్లు అడిగాడు ధన్‌వంత్.

"అవును నాయనా! నిన్ను సమయానికి హాస్పిటలుకి తీసుకువచ్చారు. అదృష్టవశాత్తు వారి బ్లడ్ గ్రూపుతో నీ బ్లడ్ గ్రూపు సరిపోబట్టి నీవు మాకు దక్కావు. వారు గనుక ఆ సహాయం చెయ్యకపోతే నీవు మాకు దక్కుండేవాడివి కాదు!" ఆపై మాటలు పెగల్లేదు ధన్‌వంత్ తల్లికి.

"ఎస్... ధన్‌వంత్ యు షుడ్ బి గ్రేట్‌ఫుల్ టు దెం. సమయానికి నిన్ను హాస్పిటల్‌కి తీసుకువచ్చి, రక్తదానం చేసి... రియల్లీ గ్రేట్ పీపుల్" డాక్టర్ అన్నాడు.

"ఎవరు డాక్టర్ వాళ్ళు...?" విస్మయంగా అడిగాడు ధన్‌వంత్.

"ఎవరో తెలియదు విలేజ్ పీపుల్ లాగున్నారు. వాళ్ళ మనిషిని ఎద్దు కుమ్మిందట. ఆ ఇంజూర్డ్ పర్సన్‌ని తీసుకొస్తుంటే దారిలో మీ కారు ఆక్సిడెంట్ కావడం గమనించి అతనితోపాటే గాయాలతో స్పృహలేకుండా వున్న మిమ్మల్ని కూడా తీసుకొచ్చారు".

"ఇప్పుడు వాళ్ళెక్కడ వున్నారు డాక్టర్?"

"లేరు. పూర్ ఫెలో! ఆరోజే చనిపోయాడు. కొంచెం ముందు అతన్ని తెచ్చుంటే బ్రతికేవాడు, కాని రక్తం ఎక్కువ పోవడం మూలాన అప్పటికే ఆలస్యమైపోయింది. ఆరోజే అతని శవాన్ని తీసుకుని వారంతా వెళ్లిపోయారు."

"ఐ యాం ఎ బ్రూట్..." రెండు కన్నీటి చుక్కలు రాలుతుండగా పశ్చాత్తాపంతో గొణుక్కున్నాడు ధన్‌వంత్.

■